క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన


వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడిపత్రి అర్బన్: మొహసిన్ ఎ ఆజం మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం రమేష్‌రెడ్డి కాలనీలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి ప్రారంభించారు. కర్నూలు శాంతిరామ్ కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు కాలనీలోని వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సకు అవసరమైన వారిని కర్నూలు శాంతి రామ్ ఆసపత్రికి తరలించారు. శస్త్ర చికిత్స అవసరం లేని వారికి ఉచితంగా చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉదయం స్థానిక హౌసింగ్ బోర్డులోని ఆర్టీఓ ఆఫీసు వద్ద ఉచిత కంటి, గుండె వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ రాజాబాబు ఆదివారం తెలిపారు. నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న శిబిరంలో కంటికి సంబంధించిన పరీక్షలను నిర్వహించడంతో పాటు ఆపరేషన్ అవసరమైన వారిని అదే రోజున నంద్యాలకు తీసుకెళ్లి ఉచితంగా కంటి లెన్స్ అమర్చుతామన్నారు. అలాగే డయాబెటిక్ నిర్ధారణ, గుండెకు సంబంధించి ఈసీజీ, 2డీ-ఎకో పరీక్షలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. డ్రైవర్లు, క్లీనర్లతో పాటు గుంతకల్లు పట్టణ, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోడల్ పరీక్షకు స్పందన


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని సాయి జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి మోడల్ పరీక్షను నిర్వహించారు. గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, సాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయరంగారెడ్డి రమేష్ మోడల్ పరీక్ష పత్రాలను విడుదల చేశారు. సుమారు 500మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మూడు రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు.

పోస్టర్ల విడుదల

గుత్తి: హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సునీత పిలుపునిచ్చారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ నాయకులు బండారు శంకర్, జిల్లా నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పామిడి: మండలంలోని పీ కొండాపురం సమీపంలో షిర్డి సాయిబాబా ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. స్థల దాతలు సునీల్‌రెడ్డి, కంబగిరిరెడ్డి, చంద్రబాబు ఆధ్వర్యంలో భూమిపూజ చేపట్టారు. దాతల విరాళాల సేకరణతో గుడి నిర్మించదలచినట్లు స్థలదాతలు తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి, మారుతిప్రసాద్, రామాంజనేయులు, మధు, రాము గురప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తండులార్చన


తండుల(బియ్యం)తో అర్చన చేస్తున్న దృశ్యం

పామిడి: పామిడిలో సత్యసాయి సేవాసమితి అధ్యక్షురాలు రాజేశ్వరి, కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తండుల (బియ్యం)తో అర్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాయి గాయత్రి మంత్రంతో అర్చన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బాలవికాస్ శాఖల పరిధిలోని గ్రామాల్లో అర్చన జరిపారు. బాలవికాస్ శిక్షణ తరగతుల బాలలకు పరీక్షలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

యల్లనూరు: మండలంలోని చిలమకూరు గ్రామంలో నూతనంగా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించనున్నట్లు ఆ శాఖ ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతుల సౌకర్యార్థం సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- శిథిల గదుల్లో చిన్నారుల చదువులు
- పట్టించుకోని అధికారులు

శింగనమల నియోజకవర్గంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. చాలా చోట్ల పాడుబడిన, శిథిలావస్థకు చేరిన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. దీంతో వర్షం వచ్చినప్పుడు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత భవనాలు నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న అచ్యుతాపురం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను 2007లో నాబార్డు నిధులతో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భవనం నిరుపయోగంగా ఉంది. 2010లో అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మికి అప్పగించాలి. ఇప్పటి వరకు అప్పగించకపోవడంతో వినియోగంలో లేదు. అప్పట్లో కాంట్రాక్టరు జనార్దన్‌రెడ్డికి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, అందుకే ఆయన బిల్డింగ్ అప్పగించలేదని అధికారులు అంటున్నారు. గుత్తేదారుడి వద్ద నుంచి భవనాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని కార్యకర్తకు ఇవ్వాల్సింది పోయి అధికారులు మౌనంగా ఉండటం ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి చొరవ తీసుకొని భవనాన్ని అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


అచ్యుతాపురంలో శిథిల గదిలో చిన్నారుల విద్యాభ్యాసం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కల్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్. కార్యకర్తగా జీవీ సుబ్బమ్మ విధులు నిర్వహిస్తున్నారు. సెంటరులో సుమారు 10మంది చిన్నారులు ఉన్నారు. అద్దె భవనం కావడంతో ఎలాంటి మౌలిక వసతులు లేవు. సెంటరు కూడా శిథిలావస్థకు చేరి పడిపోయింది. దీంతో వరండాలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అసౌకర్యాల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు.

యల్లనూరు: అంగన్‌వాడీ చిన్నారులు అవస్థల నడుమ చదువుకుంటున్నారు. ఆడుకునేందుకు స్థలం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు లేమితో అంగన్‌వాడీ కేంద్రాలు కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమై సుమారు 35 ఏళ్లు పైన గడిచినా నేటికి సొంత భవనాలు లేవు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యలతో సతమతమవుతున్నారు. సొంత భవనాలు ఏర్పాటు చేయడంలో సీడీపీఓ స్థాయి అధికారులు విఫలమౌతున్నారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న శిథిల భవనాల్లో చిన్నారులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వర్షాకాలంలో గదులన్నీ కారుతూ, అసౌకర్యాల నడుమ చదువుకుంటున్నారు. అసౌకర్యాలతో అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తుండటంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆరుబయటే చదువు..

శింగనమల నియోజకవర్గంలో శింగనమల, యల్లనూరు, పుట్లూరు, నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో మొత్తం 355 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో దాదాపు 113 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాలా చోట్ల గదులు శిథిలావస్థలకు చేరడంతో వరండాలు, ఆరుబయట కూర్చోబెట్టి పిల్లలకు చదువులు చెబుతున్నారు. సౌకర్యాలు లేవని తెలిసీ కూడా ఏం చేయాలో దిక్కుతోచక అంగన్‌వాడీ కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. శిథిల గదులు ఎప్పుడు కూలిపోతాయోనని చిన్నారులు బిక్కుబిక్కుమంటున్నారు. అద్దె భవనాల్లో గాలి, వెలుతురు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉన్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పట్టించుకోలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

శింగనమల నియోజకవర్గంలో ఇలా

మండలం	మొత్తం అంగన్ వాడీ కేంద్రాలు	అద్దె భవనాలు
యల్లనూరు	46	25
పుట్లూరు	49	18
బీకేఎస్	2	8
గార్లదిన్నె	58	17
శింగనమల	66	24
నార్పల	64	21

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. పూర్తి స్థాయిలో భవనాలు నిర్మించడానికి చర్యలు చేపడుతున్నాం. మౌలిక వసతుల కింద మరుగుదొడ్లు, కరెంటు పనులు జరుగుతున్నాయి. అద్దె భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే సొంతత భవనాలు నిర్మిస్తాం.

– సీడీపీఓ. భారతి, నార్పల ప్రాజెక్టు


వినియోగంలో లేని అంగన్‌వాడీ సెంటర్

మౌలిక వసతులు కరువు



అంగన్‌వాడీ భవనాన్ని శిథిల గదుల్లో నడుపుతున్నాం. 18 ఏళ్ల కిందట నూతనంగా అంగన్‌వా కేంద్రాన్ని నిర్మించించినా ఇంతవరకూ మాకు అప్పగించలేదు. ఆ భవనాన్ని అప్పగిస్తే చిన్నారులకు మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. ప్రీస్కూల్ పిల్లలు 13 మంది, బాలింతలు ఆరుగురు , గర్భిణీలు ఇద్దరు ఉన్నారు. ఇరుకు గదులు, తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు లేవు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మాకు కేటాయించిన భవనాన్ని అప్పగించాలని కోరుతున్నాను.

– విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్, అచ్యుతాపురం

సేవాగఢ్‌లో విగ్రహాల ప్రతిష్ట


జగదాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం


ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాలు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లోని జగదాంబ ఆలయంలో ఆదివారం మాత జగదాంబ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సుబ్రమణ్య గణపతి శాస్త్రి, మారుతీ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి గురువందనం, గోపూజ, గణపతి పూజ, మూర్తుల ప్రక్షాళన, మండప పూజలు చేశారు. యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కళావాహన, ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం మహామంగళ హారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పండిత సత్కార కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అలాగే దేవతా మూర్తుల దాతలు కర్ణాటక రాష్ట్రం యాద్‌గిర్‌కు చెందిన లక్ష్మీబాయి, నరేంద్రరాథోడ్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, సభ్యులు బాలానాయక్, కృష్ణనాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల


కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్


చిన్నపప్పూరులో శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి

గార్లదిన్నె: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మొదటి ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, ఆకుపూజ చేశారు. మాఘమాసం మొదటి రోజు కావడంతో చుట్టుప్రక్కల గ్రామాలతోపాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేచి స్వామివారిని దర్శనం చేసుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే 108 సాల గ్రామ శివలింగాలకు భక్తులు పూజలు నిర్వహించారు. సంతానం లేని మహిళలు దేవాలయం వద్ద ఉన్న పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేశారు. లాగే స్వామి మూలవిరాట్ అడుగున ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకెళ్లారు. ఈ నీటిని సేవిస్తే సకల రోగాలు నివారణ అవుతాయని, అలాగే పొలాల్లో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని ప్రజల విశ్వాసం. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం అనంతపురం నుంచి దేవస్థానం వరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడిపారు. తిరునాల సందర్భంగా గాజులు, తినుబండారాలు, చెరకు, బొరుగుల అంగళ్లు, రెండు రోజుల ముందే వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు.

కిటకిటలాడిన అశ్వత్థం

పెద్దపప్పూరు: మాఘమాసం తొలి ఆదివారం తిరునాల సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామసమీపంలో వెలసిన అశ్వర్థక్షేత్రానికి పెద్దెత్తున భక్తులు తరలివచ్చారు.వచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నాణాలు ఆచరించి స్వామికి పొంగుబాగలను పెట్టి, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, ఈఓ సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ గార్లదిన్నె బీసీ రామక్రిష్ణారెడ్డి, గ్రామపెద్దలు సౌకర్యాలు కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తాడిపత్రి ఏఎస్పీ రోషన్ కుమార్ చౌదరి, పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం తాడిపత్రి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. డా.తేజస్విని, సూపర్‌వైజర్ శర్మాస్‌వలి తిరునాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.


చిన్నపప్పూరులోని పెన్నానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

ఏపీకి మోదీ సర్కార్ మొండిచేయి



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



బుక్కరాయసముద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

గుంతకల్లుటౌన్: అన్ని రంగాల్లో వెనుకబడిన ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మోదీ సర్కారు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు జగ్గిలి రమేష్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు విమర్శించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి చూపడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం సీపీఎం నాయకులు పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఏపీకి ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాలు, సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో పాటు విభజన హామీల గురించి నోరెత్తకపోవడం సిగ్గుచేటన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సీఎం చంద్రబాబు, కూటమి ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలన్నారు. దగాకోరు బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని వారు కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర, నాయకులు షబ్బీర్, చంద్ర, ఓబులేసు, సూరి తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

బుక్కరాయసముద్రం: కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం నేతలు మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులలో ప్రతిసారీ ఏపీకి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. జిల్లాలో నిర్మాణమవుతున్న సెంట్రల్ యూనివర్శిటీకి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు లేవన్నారు. రైల్వే డివిజన్‌కు మొండిచేయి చూపారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఉపాధ్యక్షులు శివారెడ్డి, శ్రీనివాసులు, సంజీవరెడ్డి, పుల్లయ్య, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

జమ్మలమడుగు: జమ్మలమడుగులోని కెనరా బ్యాంకులో ఐదు రోజుల క్రితం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళకు సంబంధించిన బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. తమ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ పుటేజీల ఆధారంతో దొంగలను పట్టుకున్నారన్నారు. నిందితులు అనంతపురం జిల్లా మారుతినగర్, గుత్తి టౌన్‌కు చెందిన వనార్చి అనంతమ్మ, ఆమె కుమారుడు మహేష్, కోడలు గాయత్రిగా గుర్తించామన్నారు. ఆదివారం తాడిపత్రి బైపాస్ రోడ్డులో ఓమినీ కారులో పారిపోతుండగా సీఐ లింగప్ప, ఎస్ఐ బి.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, రియాజ్, నాగేంద్ర చాకచక్యంగా వారిని పట్టుకున్నారని తెలిపారు. వారి నుంచి 11 తులాల బంగారంతోపాటు ఓమినీ కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో అర్బన్ సీఐ లింగప్ప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



యాడికి: స్థానిక కోన రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82వ సంవత్సర విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో స్థిరపడిన వారంతా దాదాపు 42 ఏళ్ల తర్వాత కలవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. అనంతరం అప్పటి గురువులు విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బారెడి, ప్రస్తుత హెచ్ఎం నాగన్నను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయభాస్కర్‌రెడ్డి(బొమ్మనహాల్ ఎంపీడీఓ), ఆనంద్, మోహన్, గంగరాజు, శ్రీధర్, చంద్రమోహన్, భోగేశ్వరరెడ్డి, నరసింహమూర్తి, రామచంద్ర శైలజ, రాజేశ్వరి, స్వర్ణమంజుల, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

18న బైక్ ర్యాలీ

గుంతకల్లుటౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 18న పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తెలిపారు. బైక్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను హైదరాబాద్‌లో బీజేపీ నేత, ధర్మ రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు చికోటి ప్రవీణ్ ఆవిష్కరించారు. 18న జరిగే బైక్ ర్యాలీకి ప్రవీణ్ కూడా హాజరవుతారని, హిందూ యువతీ, యువకులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గార్లదిన్నె: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని శింగనమల సీఐ కౌలుట్లయ్య సూచించారు. ఆదివారం గార్లదిన్నె విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై సీఐ వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు సక్రమంగా లేని డ్రైవర్లకు అపరాధ రుసుం విధించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

తాడిపత్రిటౌన్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ సాయిప్రసాద్ సోమవారం పట్టణంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గొడవలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను బాగా చదివించుకొని వారి ఉన్నతికి తోడ్పడాలని హితవు తెలిపారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన


ఏఈ రాజారావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

యాడికి: మండలంలోని నిట్టూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో వ్యవసాయ బోరుబావులకు కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదని, పంటలు ఎండిపోతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవటంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం సాయంత్రం దాదాపు 150 మంది రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నిట్టూరు, చిక్కేపల్లి, గుడిపాడు, కమలపాడు, కోనుప్పలపాడు వేములపాడు, తాడిపత్రి మండలంలోని వెంకటాంపల్లి, తిమ్మేపల్లి, బ్రాహ్మనపల్లి గ్రామాల్లోని వ్యవసాయ తోటలకు విద్యుత్ సక్రమంగా రావడం లేదు. ఫిర్యాదు చేస్తే విద్యుత్ సిబ్బంది స్పందించటం లేదని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని వ్యవసాయ బోరుబావుల కింద ఉన్న సమస్యలను పరిష్కరించాలని సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఏఈ రాజారావు నిట్టూరుకు చేరుకుని సోమవారం 10గంటల కల్లా ఆయా గ్రామాల్లోని బోరుబావులకు విద్యుత్‌ను సరఫరా అయ్యేటట్లు లైన్లు మరమ్మతులు చేస్తామని తెలిపారు. దీంతో రైతులు నిరసన విరమించారు.

ఫీజు పోరు జయప్రదం చేయండి

పామిడి: కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 5న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఫీజుపోరును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆదివారం తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎంతోమంది పేద విద్యారులు ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాలు పొందారన్నారు. అదేబాటలో ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ కొనసాగించి పేద విద్యార్థులకు అండగా నిలిచారని గుర్తుచేశారు.

బీసీ కృష్ణకు ఘన నివాళి

పామిడి: పట్టణంలోని స్వరరాగ నాటక కళాసమితి శిక్షణాలయంలో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.దేవరాజు ఆధ్వర్యంలో ఆదివారం దివంగత నాటకరంగ నటరాజు, ఆంధ్ర బిల్వమంగళ పాత్రధారి బీసీ కృష్ణ మృతిపై సంతాప సభ ఏర్పాటు చేశారు. గత శనివారం ఆయన అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతిపై ఏర్పాటు చేసిన సంతాప సభలో దేవరాజ్ మాట్లాడారు. శ్రీకృష్ణ, సత్య హరిశ్చంద్ర, బిల్వ మంగళ పాత్రలకు ప్రాణం పోషి నటరత్న బిరుదాంకితుడు బీసీ కృష్ణ అన్నారు. ఆ సమితి సభ్యులు పుంజా కృష్ణారావుయాదవ్, బాషా, రమణమూర్తి, సుబ్రమణ్యం. ఆంథోని, నాగార్జున, హనుమంతరెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బన్న, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గుత్తి: గుత్తి శివారులోని 44వ జాతీయ రహదారిపై టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో శివశంకర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పామిడి మండలం సొరకాయల పేట గ్రామానికి చెందిన శివ శంకర్ ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరాడు. అయితే మార్గ మధ్యంలో బైక్‌ను కారు ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన శివశంకర్‌ను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.